సాక్షి జగిత్యాల

బుధవారం । 6 । నవంబర్ । 2024



నృసింహుడి సన్నిధిలో భక్తుల రద్దీ

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మినృసింహస్వామి ఆలయంలో మంగళవారం భక్తుల రద్దీ నెలకొంది. కార్తీక మాసం సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చి స్వామివార్లను దర్శించుకున్నారు.



ఈవీఎంల గోదాం తనిఖీ

జగిత్యాల: జిల్లాకేంద్రంలోని ఈవీఎం గోదాంలను కలెక్టర్ సత్యప్రసాద్ మంగళవారం తనిఖీ చేశారు. ధరూర్ క్యాంప్‌లో ఉన్న గోదాంల వద్ద ఎప్పుడూ సెక్యూరిటీ ఉండాలన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.0/20.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉదయం దట్టమైన పొగమంచు కురిసే అవకాశం ఉంది. సాయంత్రం చలిగాలులు కొనసాగుతాయి.

న్యూస్‌రీల్

మిల్లర్లు ధాన్యం దిగుమతి చేసుకోవాలి:కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల: జిల్లాలోని రైస్ మిల్లర్లు ధాన్యాన్ని దిగుమతి చేసుకోవాలని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. మంగళవారం రైస్‌మిల్లర్లతో సమావేశమయ్యారు. నిబంధనల ప్రకారం 10శాతం బ్యాంక్ గ్యారంటీని మిల్లర్లు ఇవ్వాలని సూచించారు. సీఎంఆర్ వెంటనే అప్పగించాలన్నారు. అదనపు కలెక్టర్ లత, డీఎస్‌వో, డీఎంవో పాల్గొన్నారు.

సెలవులో ఎస్పీ అశోక్‌కుమార్



జగిత్యాలక్రైం: ఎస్పీ అశోక్‌కుమార్ మంగళవారం నుంచి ఈనెల 19 వరకు సెలవులో ఉండనున్నారు. వ్యక్తిగత పని నిమిత్తం ఆయన సెలవు పెట్టారు. రాజన్న సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

కుల గణన కోసం బడులను మూసివేస్తారా..?



డీటీఎఫ్ సభ్యత్వ నమోదులో నాయకులు

ధర్మపురి: రాష్ట్రప్రభుత్వం చేపట్టే కుల గణన కోసం బడులను ఒకపూట మూసివేయడం సరికాదని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎన్నం రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి నరేందర్ తెలిపారు. ధర్మపురితోపాటు మండలంలోని వివిధ గ్రామాల్లో మంగళవారం సభ్యత్వ నమోదు చేపట్టారు. చట్టబద్ధత లేని సర్వే కోసం బడులను ఒకపూట మూసివేసి ఉపాధ్యాయులతో సర్వే చేయించడం సరికాదని సూచించారు. ప్రతి ఊరిలో ఉద్యోగులు ఉన్నారని, నెట్‌వర్క్ సౌకర్యం కూడా ఉందని, ప్రతి గ్రామంలో పాఠశాల.. లేదా ప్రభుత్వ కార్యాలయంలో సర్వే చేపడితే ప్రజలే అక్కడి వస్తారని, అంతదానికి రూ.కోట్లు ఖర్చు పెట్టడం ఎందుకని ప్రశ్నించారు. కార్యక్రమంలో డీటీఎఫ్ మండల నాయకులు రాజేశం, మల్లికార్జున్, నాందేవ్, గంగాధర్ తదితరలున్నారు.

విద్యుత్ ప్రమాదాల బారిన పడొద్దు



తాటిపల్లి పొలం బాటలో పాల్గొన్న అధికారులు, రైతులు

జగిత్యాలరూరల్: విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా రైతులు జాగ్రత్తలు పాటించాలని జిల్లా విద్యుత్ శాఖ అధికారి సాలియానాయక్ అన్నారు. మంగళవారం విద్యుత్ శాఖ అధి కారులు చేపట్టిన పొలంబాట కార్యక్రమాన్ని రూరల్ మండలం తాటిపల్లిలో ప్రారంభించారు. ట్రాన్స్‌ఫార్మర్‌లో ఫ్యూజ్‌లు పోతే విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించాలని, రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ మరమ్మతు చేపట్టవద్దని సూచించారు. రైతులు కెపాసిటర్ బిగించుకుంటే మోటార్‌తోపాటు ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోకుండా ఉంటాయన్నారు. డీఈ (టెక్నికల్) గంగారాం, జగిత్యాల టౌన్ ఏడీఈ జవహర్‌లాల్‌నాయక్, చల్‌గల్ ఏఈ శ్రీధర్, రైతులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలి

జగిత్యాలటౌన్: పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని, పీఆర్సీ అమలు చేయాలని టీపీయూఎస్ జిల్లా అధ్యక్షుడు బోనగిరి దేవయ్య అన్నారు. యూనియన్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్మాగ్రహ దీక్ష చేపట్టారు. ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. నాలుగు డీఏలను విడుదల చేయాలని, జీపీఎఫ్, సంపాదిత సెలవులు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ మంజూరు చేయాలన్నారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అయిల్నేని నరేందర్‌రావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఒడ్నాల రాజశేఖర్ మాట్లాడుతూ పీఆర్సీని అమలుచేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వీరమల్ల వెంకటరమణరావు,నాయకులు రొట్టె శ్రీనివాస్, ఎలిగేటి రాజేంద్రప్రసాద్, గుడిసె పూర్ణచందర్, మహేశ్వర్‌శర్మ, భోగ మల్లేశం, రఘునందన్, శ్రీలత, భాగ్యలక్ష్మి, రమాదేవి పాల్గొన్నారు.

పిల్లలేం చూస్తున్నారో?


Special Story



- సెల్‌ఫోన్ మైకంలో విద్యార్థులు, యువత
- తల్లిదండ్రులూ.. నిఘా తప్పనిసరి
- ఈ ఏడాది ఇప్పటివరకు జిల్లాలో 71 సైబర్ క్రైం కేసులు

నేటి పిల్లలు, యువత సెల్‌ఫోన్ మైకంలో ఉంటున్నారు. క్షణం తీరిక లేకుండా తిండి, నిద్ర మానేసి, అందులోనే లీనమవుతున్నారు. ఫోన్, కంప్యూటర్ వాడేవారు ఇంటర్‌నెట్‌లోకి వెళ్లగానే ఏదో ఒక రూపంలో అశ్లీలం పలకరిస్తుంది. పొరపాటున దాన్ని క్లిక్ చేస్తే ఆ తర్వాత అన్నీ అలాంటి దృశ్యాలే పదేపదే వస్తుంటాయి. విద్యార్థులు, ముఖ్యంగా యువత ఇలాంటి సైట్లు చూడటం మొదలుపెడితే అది అలవాటుగా మారి, చివరికి వ్యసనమవుతుంది. గంటల తరబడి సోషల్ మీడియాలో ఉంటున్న పలువురు అనర్థాలు కొనితెచ్చుకుంటున్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు కరీంనగర్ జిల్లావ్యాప్తంగా 71 సైబర్ క్రైం కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు తమ పిల్లలు ఫోన్, కంప్యూటర్‌లో ఏం చూస్తున్నారో నిఘా ఉంచాలి. అవసరం తీరగానే వాటిని తీసుకోవాలి.

- 8లో▶



కార్మికుల నియామకాల లొల్లి

- అక్రమాలు జరిగాయంటూ ఫిర్యాదు
- ఎమ్మెల్యే వద్దకు చేరిన పంచాయితీ?



అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న వైస్ చైర్మన్, కౌన్సిలర్లు

జగిత్యాల: జగిత్యాల మున్సిపాలిటీలో కార్మికుల నియామకాల్లో అక్రమాలు జరిగాయంటూ లొల్లి చోటుచేసుకుంటోంది. ఈ విషయంపై ఏకంగా వైస్ చైర్మన్, కౌన్సిలర్లు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. బల్దియాలో ఇటీవల దాదాపు 10 మంది కార్మికులను కాంట్రాక్టు పద్ధతిలో నియమించారు. అయితే కార్మికుల నుంచి డబ్బులు వసూలు చేశారని, వారి నియామకాన్ని రద్దు చేయాలని వైస్ చైర్మన్, కొంతమంది కౌన్సిలర్లు అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మున్సిపాలిటీలో దాదాపు 291 మంది కార్మికులు పనిచేస్తున్నారు. వీరిలో ఎవరైనా చనిపోయినా.. వివిధ కారణాలతో మానేసిన కొత్త వారిని నియమించుకునే అవకాశం ఉంది. ఇందుకు కౌన్సిల్‌తోపాటు కలెక్టర్ ఆమోదం తప్పనిసరి. కానీ.. అలాంటిదేమీ లేకుండానే పదిమంది కార్మికులను విధుల్లోకి తీసుకున్నారని, ఆ కార్మికులకు వేతనాలు ఇవ్వొద్దన్న డిమాండ్ తెరపైకి వచ్చింది. మొన్నటివరకు వైస్ చైర్మన్ ఇన్‌చార్జి చైర్మన్‌గా ఉన్న సమయంలో కొంత మందిని తీసుకున్నారని, అప్పుడు ఆమోదం లేకుండానే తీసుకున్నారని మరి కొంత మంది కౌన్సిల్ సభ్యులు గుర్తు చేస్తున్నారు. అప్పుడు తీసుకుంటే తప్పుకాదుగానీ.. ఇప్పుడు తీసుకుంటే తప్పెలా అవుతుందని ప్రశ్నిస్తున్నారు.

ఎమ్మెల్యే వద్దకు పంచాయితీ?

కార్మికుల నియామకానికి సంబంధించిన అంశం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు దృష్టికి పాలకవర్గం, కౌన్సిల్ సభ్యులు తీసుకెళ్లినట్లు విశ్వసనీయంగా తెలిసింది. నియామకాల్లో అక్రమాలు జరగలేదని అయనతో చెప్పినట్లు సమాచారం. దీనిపై ఎమ్మెల్యే పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు తెలిసింది.

చైర్‌పర్సనే టార్గెటా..?

వైస్ చైర్మన్‌తో కలిసి కొందరు కౌన్సిలర్లు ఫిర్యాదు చేయడంతో చైర్ పర్సన్‌ను టార్గెట్ చేసినట్లు తెలుస్తోంది. 2020లో మొదటిసారి బీఆర్‌ఎస్ పాలకవర్గం ఏర్పడగా.. చైర్‌పర్సన్‌గా బోగ శ్రావణి బాధ్యతలు స్వీకరించారు. కొన్ని కారణాలతో ఆమె తన పదవికి రాజీనామా చేశారు. ఆ సమయంలో వైస్ చైర్మన్‌గా ఉన్న గోలి శ్రీనివాస్‌కు ఇన్‌చార్జిగా బాధ్యతలు తీసుకున్నారు. దాదాపు రెండేళ్లపాటు ఆయనే కొనసాగారు. కాంగ్రెస్ ప్రభుత్వం రావడం .. మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నికకు మార్గం సుగమం కావడంతో బీఆర్‌ఎస్ నుంచి రెబల్‌గా ఉన్న అడువాల జ్యోతి చైర్‌పర్సన్‌గా ఎంపికైంది. ఆమెకు కాంగ్రెస్ కౌన్సిలర్లు కూడా మద్దతిచ్చారు. ప్రస్తుతం అందరూ అధికార పార్టీకి చెందిన వారు ఉండడంతో బల్దియా అభివృద్ధి బాట పడుతుందని అనుకున్నారు. కానీ అంతలోనే కార్మికుల నియామకం విషయంలో ఫిర్యాదులు రావడంతో చైర్‌పర్సన్‌ను టార్గెట్ చేసినట్లు తెలుస్తోంది. పాలకవర్గానికి మరో రెండు నెలల సమయం మాత్రమే ఉంది.

కార్మికుల పరిస్థితేంటి?

కొత్తగా నియమించిన కార్మికులకు వేతనాలు నిలిపివేసినట్లు సమాచారం. ఫైల్ రాలేదని, వస్తేనే పరిశీలిస్తామని కమిషనర్ చెబుతున్నారు. వీరు నియామకం సమయంలో వాస్తవంగా డబ్బులు ఇచ్చారా..? లేదా..? అన్నది విచారణలో తేలనుంది. అక్టోబర్‌కు సంబంధించిన వేతనాలు ఆపడంతో వారి పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది.

ఫైల్ పరిశీలించాకే



ఒప్పంద కార్మికుల నియామకానికి సంబంధించిన ఫైల్ నా వద్దకు రాలేదు. వస్తే దానిని పూర్తిస్థాయిలో పరిశీలిస్తాను. కలెక్టర్ ఆమోదం తెలిపారా..? లేదా..? నిర్ధారించిన తర్వాతే నిర్ణయం తీసుకుంటాం.

– చిరంజీవి, మున్సిపల్ కమిషనర్

ఖాతాదారుల పింఛన్లు స్వాహా

- బిజినెస్ కరస్పాండెంట్ చేతివాటం..?
- ఓ పింఛన్‌దారు ఫిర్యాదుతో వెలుగులోకి
- విచారణ చేపట్టి ఐడీని సస్పెండ్ చేసిన బ్యాంక్ మేనేజర్
- రంగదామునిపల్లిలో ఘటన



రంఘదామునిపల్లి గ్రామంలో విచారణ చేస్తున్న బ్యాంక్ మేనేజర్

గొల్లపల్లి: గొల్లపల్లి మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ బిజినెస్ కరస్పాండెంట్ ఖాతాదారుల సొమ్మును స్వాహా చేసిన విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. ఏడాదిన్నర క్రితం కూడా ఇలాగే శ్రీరాములపల్లికి చెందిన బిజినెస్ కరస్పాండెంట్ పెద్దమొత్తంలో సొమ్ము స్వాహా చేసిన విషయం తెల్సిందే. ఆ ఘటన మరవకముందే తాజాగా రంగదామునిపల్లి బిజినెస్ కరస్పాండెంట్ చేతివాటం ప్రదర్శించడం గమనార్హం. ఓ బాధితురాలి ఫిర్యాదుతో ఈ ఘటన వెలుగుచూసింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రేగొండ రాజ్‌కుమార్ స్థానిక యూనియన్ బ్యాంక్ బిజినెస్ కరస్పాండెంట్‌గా పనిచేస్తున్నాడు. ఖాతాదారులు, పింఛన్‌దారులు, స్వశక్తి మహిళా గ్రూప్‌ల లావాదేవీలు చూస్తున్నాడు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన కాసారపు వజ్రవ్వ పింఛన్ కోసం రాజ్‌కుమార్ వద్దకు వెళ్లింది. చెక్ చేసిన ఆయన ఖాతాలో డబ్బులు లేవని చెప్పాడు. వారికి అనుమానం వచ్చి బ్యాంక్‌కు వెళ్లి ఆరా తీయగా రూ.3వేలు డ్రా చేసినట్లు గుర్తించారు. వారు రాజ్‌కుమార్‌ను నిలదీయడంతో వారికి ఫోన్‌పే ద్వారా సొమ్ము చెల్లించాడు. దీంతో వజ్రవ్వ ఈనెల ఒకటిన బ్యాంక్ మేనేజర్‌కు ఫిర్యాదు చేసింది. మేనేజర్ విచారణలో చాలామంది ఖాతాదారులు, పింఛన్‌దారుల సొమ్ము దారి తప్పినట్లు వెలుగుచూసింది. విచారణ కొనసాగుతుండగానే.. రాజ్‌కుమార్ బాధితులకు డబ్బులు చెల్లిస్తూ వస్తున్నాడు. దీంతో మేనేజర్ ప్రశాంత్ రాజ్‌కుమార్ ఐడీని సస్పెండ్ చేశారు. బ్యాంక్ అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో విచారణ చేపడితే స్వాహాపర్వం బయట పడే అవకాశముందని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. ఈ విషయమై బ్యాంక్ మేనేజర్ శ్రీకాంత్ మాట్లాడుతూ.. బిజినెస్ కరెస్పాండెంట్ ఐడీని సస్పెండ్ చేశామని, మోసపోయిన వారు ఫిర్యాదు చేస్తే న్యాయం చేస్తామని వెల్లడించారు. అయితే తానంటే గిట్టని వారే దుష్ప్రచారం చేస్తున్నారని, కేవలం వజ్రవ్వ పింఛన్ డబ్బులు మాత్రం సర్వర్ సమస్యతో పొరబాటు జరిగిందని, ఎవరి డబ్బులు వారికి ఇచ్చానని రాజ్‌కుమార్ తెలిపాడు.

పార్టీలకతీతంగా పాదయాత్రలో పాల్గొనండి

- కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్



బీఆర్‌ఎస్ నాయకులతో సమావేశమైన ఎమ్మెల్యే

కోరుట్ల/కోరుట్లరూరల్: రాష్ట్రప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 12న కోరుట్ల నుంచి జగిత్యాల వరకు తాను నిర్వహించే పాదయాత్రలో రైతులు పార్టీలకతీతంగా పాల్గొనాలని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రైతులు, బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకిచ్చిన హామీలు నెరవేర్చడం లేదని, ధాన్యం కొనుగోళ్లపై ఇప్పటివరకు ప్రణాళిక ప్రకటించలేదని పేర్కొన్నారు. వనాకాలం రైతుబంధు ఎగ్గొట్టిందని, కొందరికే రుణమాఫీ చేసి చేతులు దులుపుకుందని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి రైతులు పెద్ద ఎత్తున పాదయాత్రలో పాల్గొనేలా నాయకులు కృషి చేయాలన్నారు. నాయకులు చీటి వెంకట్రావు, దారిశెట్టి రాజేశ్, తోట నారాయణ, కేతిరెడ్డి భాస్కర్ రెడ్డి, కాశిరెడ్డి మోహన్ రెడ్డి, వనతడుపుల అంజయ్య పాల్గొన్నారు. ముందుగా ఎంపీడీవో కార్యాలయంలో బ్యాంకర్లతో సమావేశమయ్యారు. రుణమాఫీ కాని రైతుల వివరాలు తెలుసుకున్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతా

మల్లాపూర్: తాను చేసే పాదయాత్రలో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతానని ఎమ్మెల్యే సంజయ్ స్పష్టం చేశారు. మండలంలోని రేగుంటలో శ్రీమల్లికార్జున స్వామి ఆలయ అభివృద్ధి పనులకు భూమిపూజ, సిరిపూర్‌కు చెందిన బాధిత కుటుంబాలకు ఎల్‌వోసీ పత్రాలు అందించారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలతో అధికారంలోకొచ్చి 10నెలల పాలనలోనే అన్నివర్గాలను మోసం చేసిందన్నారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కాటిపెల్లి సరోజన, మాజీ వైస్ ఎంపీపీ గౌరు నాగేశ్, నాయకులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆసుపత్రుల తనిఖీ

- నిబంధనల మేరకు ఉన్నాయా.. అని ఆరా
- రికార్డులు పరిశీలించిన డీఎంహెచ్‌వో సమీయోద్దీన్



ఓ ఆసుపత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న వైద్యాధికారి

సాక్షి ఎఫెక్ట్..

మెట్‌పల్లి: పట్టణంలోని పలు ప్రైవేట్ ఆసుపత్రులను జిల్లా వైద్యాధికారి డాక్టర్ సమీయోద్దీన్ తనిఖీలు నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రైవేట్ ఆస్పత్రులు నిబంధనలు పాటించకపోవడంతో 'పుట్ట గొడుగుల్లా ఆస్పత్రులు' శీర్షికన మంగళవారం 'సాక్షి' కథనం ప్రచురించిన విషయం తెల్సిందే. కథనానికి స్పందించిన డీఎంహెచ్‌వో పట్టణంలోని పలు ఆస్పత్రులను తనిఖీ చేశారు. వైద్యుల వివరాలు, రిజిస్ట్రేషన్ పత్రాలు, ల్యాబ్, ఆపరేషన్ థియేటర్, బయోవేస్ట్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. నిబంధనలు పాటించని రెండు ఆస్పత్రులకు నోటీసులు ఇచ్చినట్లు తెలిపిన ఆయన.. సదరు ఆసుపత్రుల పేర్లు చెప్పడానికి మాత్రం నిరాకరించడం గమనార్హం. ప్రైవేట్ ఆస్పత్రులపై మీడియాలో కథనాలు వచ్చినప్పుడు అధికారులు తనిఖీలు చేసి.. కేవలం నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకొంటున్నారు. ఆయా ఆస్పత్రులు ని బంధనల మేరకు కొనసాగుతున్నాయా..? లేదా..? అని పరిశీలించకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ట్రేడ్ యూనియన్లను పునరుద్ధరించండి

జగిత్యాలటౌన్: ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తూ ఇప్పటికే గెజిట్ విడుదలైనందున అపాయింటెడ్ డేట్ ప్రకటించి జీవో జారీ చేయాలని ఆర్టీసీ జేఏసీ నాయకులు కోరారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జేఏసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ పాలనాధికారికి వినతిపత్రం సమర్పించారు. ఆర్టీసీ కార్మికులకు హామీలిచ్చి అధికారంలోకొచ్చిన కాంగ్రెస్ 10 నెలలు గడుస్తున్నా అమలు చేయడం లేదన్నారు. మహాలక్ష్మి పథకానికి ప్రతినెలా రూ.350 కోట్లు విడుదల చేయాలని, జీరో టికెట్ స్థానంలో పాస్‌లు జారీ చేయాలని కోరారు. ఆర్టీసీ విలీనం పూర్తి చేసి ట్రేడ్‌యూనియన్లను పునరుద్ధరించాలన్నారు. కొత్త బస్సులు కొనుగోలు చేయాలని విన్నవించారు. జేఏసీ నాయకులు పత్తిపాక రాములు (టీఎంయూ), పి.కుమారస్వామి (ఈయూ), సీహెచ్.రాజయ్య(ఎన్ఎంయూ), తొగిటి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

శిశువు తారుమారుపై చర్యలు

- కాంట్రాక్ట్ ఉద్యోగి తొలగింపు
- ఇద్దరు స్టాఫ్‌నర్స్, హెడ్‌నర్స్‌కు మెమో జారీ

జగిత్యాల: జిల్లాకేంద్రంలోని మాతాశిశు సంక్షేమ కేంద్రంలో సిబ్బంది నిర్లక్ష్యంతో సోమవారం శిశువులు తారుమారైన విషయం తెల్సిందే. ఈ మేరకు విచారణ చేపట్టిన అధికారులు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు సపోర్టింగ్ నర్స్‌గా పని చేస్తున్నకాంట్రాక్టు ఉద్యోగిలతను విధుల నుంచి తొలగించారు. ఇద్దరు స్టాఫ్‌నర్స్‌లకు మెమో జారీ చేశామని ఆస్పత్రిసూపరింటెండెంట్ రాములు తెలిపారు.

ఓపెన్ జిమ్.. నిర్వహణ నిల్

- పిచ్చి మొక్కలతో నిండిపోయిన పరిసరాలు
- తుప్పు పట్టిపోతున్న పరికరాలు
- మున్సిపల్ అధికారుల తీరుతో ప్రజలకు ఇబ్బందులు



- పట్టణంలోని మినీ స్టేడియంలో ఉన్న ఓపెన్ జిమ్ ఇది. దీని చుట్టూ ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలతో పరిసరాలు అధ్వానంగా తయారయ్యాయి. దోమలు విజృంభిస్తున్నాయి. ఇక్కడకు వచ్చే ప్రజలు సకల సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. మున్సిపల్ కార్మికులతో ఎప్పటికప్పుడు శుభ్రం చేయించే అవకాశమున్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడం విమర్శలకు తావిస్తోంది.



- ఇది మండల పరిషత్ పార్కులో ఉన్న ఓపెన్ జిమ్. దీని నిర్వహణను గాలికి వదిలేయడంతో ఇందులోని ఫ్లోర్, టైల్స్ పగిలిపోతున్నాయి. చెత్త పేరుకుపోవడం , పరిసరాలు దుర్గంధాన్ని వెదజల్లడం వంటి సమస్యలు నెలకొన్నాయి. అలాగే లైట్లు లేకపోవడంతో రాత్రి పూట మందుబాబులకు అడ్డాగా మారింది

మెట్‌పల్లి: ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లు నిర్వహణ లోపంతో అధ్వానంగా తయారవుతున్నాయి. ప్రజల్లో ఆరోగ్య స్పృహ పెరగడంతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పట్టణాల్లో అవసరమైన చోట జిమ్‌లను ఏర్పాటు చేసింది. ఒక్కో జిమ్‌కు సుమారు రూ.15లక్షలు ఖర్చు చేసింది. మెట్‌పల్లి పట్టణంలో రెండు చోట్ల ఏర్పాటు చేశారు. వీటి నిర్వహణను మున్సిపాలిటీ పట్టించుకోకపోవడంతో పలు సమస్యలు తలెత్తుతున్నాయి. దీనివల్ల అక్కడకు వచ్చే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఇవీ సమస్యలు..

- నిర్వహణ లేకపోవడం వల్ల జిమ్‌లు అపరిశుభ్రంగా ఉంటున్నాయి.
- మినీ స్టేడియంలో ఉన్న జిమ్‌లో మర్మమతు చేయకపోవడంతో ఫ్లోరింగ్ టైల్స్ పూర్తిగా తొలిగిపోయాయి.
- మండల పరిషత్ జిమ్‌లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. టైల్స్ ఎక్కడికక్కడ తొలిగిపోతున్నాయి.
- ఈ జిమ్‌లో లైట్లు లేకపోవడంతో చీకట్లోనే ఇబ్బందులు పడుతూ కసరత్తు చేస్తున్నారు.
- ఇప్పటివరకు గ్రీసింగ్ చేయకపోవడంతో వాటిల్లోని పరికరాలు తుప్పు పట్టిపోయి సరిగ్గా పని చేయడం లేదు.
- అంతేగాకుండా రెండింటిలో కొన్ని పరికరాలు ఊడిపోయి ఉండడంతో వాటిని గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకొని వెళ్లిపోయారు.

మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం

- వాస్తవానికి ఈ జిమ్‌లు ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరంగా ఉండడంతో ప్రతిరోజు పెద్ద సంఖ్యలో ప్రజలు వినియోగించుకుంటున్నారు.
- వీటి నిర్వహణ విషయంలో మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం చూపుతుండడం వల్ల రాబోయే రోజుల్లో అందులోని పరికరాలు పూర్తిగా పనికి రాకుండా పోయే అవకాశాలున్నాయి.
- అధికారులు స్పందించి జిమ్‌ల నిర్వహణపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

మా దృష్టికి రాలేదు



జిమ్‌లలో నెలకొన్న సమస్యలు ఇప్పటి వరకు మా దృష్టికి రాలేదు. వాటిని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం. జిమ్‌లకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తాం.

– మోహన్, కమిషనర్





అపహరణకు గురైన పరికరాలు

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి



శివాజీ, అరుణ్ మృతదేహాలు

రామడుగు: మండలంలోని షా నగర్ గ్రామ శివారులో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మండల కేంద్రానికి చెందిన ఇద్దరు యువకులు మృతిచెందినట్లు ఎస్సై శేఖర్ పేర్కొన్నారు . మండల కేంద్రానికి చెందిన సామంతుల శివాజీ (18) నీలం అరుణ్ (20) ద్విచక్రవాహనంపై వెదిర వైపు నుంచి రామడుగు గ్రామానికి వెళ్తున్నారు. షానగర్ గ్రామ శివారులో ఎదురుగా వస్తున్న టాటాఏస్ వాహనం ఢీకొట్టడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. సంఘటన స్థలానికి చేరుకొని పోలీసులు వివరాలు సేకరించారు. మృతదేహాలను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ప్రమాదవశాత్తు డ్రెయినేజీలో పడి వ్యక్తి మృతి



బందెల సాగర్ మృతదేహం

జగిత్యాలక్రైం: జగిత్యాల కొత్త బస్టాండ్ సమీపంలో సాగర్ అనే వ్యక్తి మద్యం మత్తులో డ్రెయినేజీలో పడి మృతిచెందాడు. బీర్‌పూర్ మండలం కొల్వాయి గ్రామానికి చెందిన బందెల సాగర్ (35) పదేళ్లుగా కొత్తబస్టాండ్‌సమీపంలోని ఓ హోటల్‌లో పనిచేస్తున్నాడు. నిత్యం మద్యం సేవిస్తున్నాడు. మంగళవారం ఉదయం అతిగా మద్యం సేవించి డ్రెయినేజీ పక్క నుంచి వెళ్తుండగా ప్రమాదవశాత్తు అందులో పడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి బావ కుంబాల భూమయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్సై మన్మథరావు తెలిపారు.

చేప తగిలి యువకుడి మృతి

గొల్లపల్లి: మండలంలోని చెందోళికి చెందిన నారవేణి తిరుపతి(38) చేపల వేటకు వెళ్లగా.. అక్కడ చేప తగిలి గాయపడ్డాడు. చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. తిరుపతి తన మిత్రులతో కలిసి గ్రామంలోని చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. ఆ సమయంలో ఓ చేప వచ్చి తిరుపతి చాతి భాగంలో బలంగా తగిలింది. అతడిని స్నేహితులు, స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. తిరుపతి భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య



దాసారపు శ్యాం

శంకరపట్నం మండలంలోని మెట్‌పల్లిలో మంగళవారం ఉరేసుకొని దాసారపు శ్యాం(25) ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దాసారపు ఎల్లయ్య–తిరుపతమ్మ చిన్న కుమారుడు శ్యాం కారు కొనుక్కుని హైదరాబాద్‌లో కొన్నేళ్లుగా అద్దెకు నడుపుతున్నాడు. పదిరోజుల క్రితం ఇంటికి వచ్చాడు. ఇటీవల అప్పులు ఉన్నాయని కుటుంబసభ్యులు, బంధువులకు తెలిపాడు. తల్లిదండ్రులు పనికి వెళ్లడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. లోన్‌యాప్‌ల వేధింపులతోనే శ్యాం ఆత్మహత్య చేసుకున్నట్లు బంధువులు తెలిపారు. ఈ విషయమై కేశవపట్నం ఎస్సై రవిని వివరాలు కోరగా ఫిర్యాదు అందలేదన్నారు.

పిల్లలేం చూస్తున్నారో?

- సెల్‌ఫోన్ మైకంలో విద్యార్థులు, యువత
- 'నెట్'లో పడితే అంతే సంగతులు
- తల్లిదండ్రులూ.. నిఘా తప్పనిసరి
- నిర్లక్ష్యం చేస్తే అవమానాలు, అంతులేని శోకమే
- ఈ ఏడాది ఇప్పటివరకు కరీంనగర్ జిల్లాలో 71 సైబర్ క్రైం కేసులు

కరీంనగర్ క్రైం: కరోనా కారణంగా కాలు బయటపెట్టే వీల్లేకపోవడంతో పిల్లలు ఫోన్, కంప్యూటర్లలో ఆటలకు పరిమితమయ్యారు. అవి వారిలో హింసా ప్రవృత్తిని ప్రేరేపించాయి. క్రమంగా బెట్టింగ్‌కు అలవాటు పడేలా చేశాయి. ఇలా రూ.లక్షలు పోగొట్టుకున్నవారు ఉన్నారు. పరువు పోతుందని బయటకు రాని సంఘటలు ఎన్నో. గతంలో బ్లూవేల్ ఆటకు అలవాటు పడ్డ పిల్లలు ఆత్మహత్య చేసుకున్న ఘటనలూ ఉన్నాయి.



★ సోషల్ మీడియాతో చేటు



ఈ కాలపు యువత కాలక్షేపం అంతా సోషల్ మీడియాలోనే. నేరగాళ్లు వీటి మాటున చెలరేగుతున్నారు. ఫేస్‌బుక్ వేదికగా జరుగుతున్న మోసాలకూ అంతులేదు. అవతలి వ్యక్తి ఎవరో తెలియకుండా మొదలవుతున్న స్నేహం అనర్థాలకు దారితీస్తోంది. అమ్మాయిల ఫొటోలతో చాటింగ్ మొదలు పెడుతున్నవారు ఉచ్చు బిగించి, వేధింపులకు పాల్పడుతున్నారు.

★ మాల్‌వేర్ చొరబాటు..



అనేక అంశాలకు సంబంధించిన పుస్తకాలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటున్నాయి. చదవాలనే ఆసక్తితో కొన్నింటిని తెరవగానే కంప్యూటర్లలోకి మాల్‌వేర్ చొరబడుతోంది. ఇది కంప్యూటర్ కార్యకలాపాలను నేరస్తులకు చేరవేయడమే కాదు.. బ్యాంకు ఖాతాల సమాచారాన్నీ చోరీ చేస్తుంది.

★ సైబర్ స్టాకింగ్..



ఆన్‌లైన్లో మారుపేరుతో స్నేహం చేస్తూ.. మహిళలను లైంగికంగా వేధించడమే సైబర్ స్టాకింగ్. ఈ తరహా నేరగాళ్లు మహిళల ఫోన్ నంబర్లు, ఈ–మెయిల్ ఐడీలు సేకరించి, ఇబ్బంది పెడతారు. విద్యార్థినులు, ఉద్యోగినులు దీని బారిన పడుతున్నారు.

★ సైబర్ టీజింగ్..



సూటిపోటి మాటలతో వేధించడం టీజింగ్. అదే ఆన్‌లైన్లో చేస్తే సైబర్ టీజింగ్. అనేక మంది ఇప్పుడు ఆన్‌లైన్లో దీన్నే ఫాలో అవుతున్నారు. ముఖ్యంగా అమ్మాయిలను రకరకాలుగా వేధిస్తున్నారు. తల్లిదండ్రులకు చెబితే ఏమనుకుంటారో అనే భయంతో వారు తమలో తామే కుమిలిపోతుంటారు.

★ క్యాట్ ఫిషింగ్..



మారుపేరుతో మోసానికి పాల్పడటం క్యాట్ ఫిషింగ్. ఈ తరహా నేరగాళ్లు మారు పేర్లు, ఫొటోలతో ఆన్‌లైన్ ప్రొఫైల్స్ పెట్టుకుంటారు. సామాజిక మాధ్యమాల ద్వారా కొంతకాలం స్నేహితులుగా నటిస్తారు. తర్వాత తమకు ప్రమాదం జరిగిందని, ఇంట్లో వాళ్లకు తీవ్ర అనారోగ్యం వచ్చిందని డబ్బు గుంజేందుకు ప్రయత్నిస్తుంటారు.

★ డాక్సింగ్..



ప్రముఖ వ్యక్తులు, సంస్థలను రకరకాలుగా వేధించడమే డాక్సింగ్. సంస్థలు, వ్యక్తుల కంప్యూటర్లలోకి చాటుగా చొరబడుతున్న నిందితులు కీలక సమాచారం తస్కరిస్తున్నారు. దాన్ని అంతర్జాలంలో పెడుతూ పరువు తీస్తున్నారు. అడిగినంత డబ్బు చెల్లించకపోతే ఇంకా ముఖ్యమైన సమాచారం బహిర్గతం చేస్తామని బెదిరిస్తారు.

★ సైబర్ బుల్లీయింగ్..



60 శాతం మంది యువత సైబర్ బుల్లీయింగ్ బారిన పడుతున్నారు. ఎదుటివారిని మానసికంగా దెబ్బతీసేలా పోస్టులు పెడుతూ ఇబ్బంది పెడతారు.

★ స్వాటింగ్..



ఫలానా వ్యక్తి సంఘ విద్రోహశక్తి. అతని దగ్గర మారణాయుధాలో, మాదకద్రవ్యాలో ఉన్నాయని పోలీసులకు సమాచారమిచ్చి, ఇబ్బందులకు గురిచేయడమే స్వాటింగ్. గిట్టనివారిని లక్ష్యంగా చేసుకునే నేరమిది.

★ వీడియో చాట్‌తో మోసం



రకరకాల పద్ధతుల్లో ఫోన్ నంబర్లు సేకరిస్తున్న నేరగాళ్లు అందమైన అమ్మాయిలతో మాట్లాడిస్తున్నారు. కొద్దిగా పరిచయం కాగానే వీడియో కాల్‌లో చాటింగ్ చేద్దామని ముగ్గులోకి దింపుతారు. అందుకు సిద్ధమవగానే రెచ్చగొట్టేందుకు వీడియో కెమెరా ముందే నగ్నంగా మారిపోతారు. మాటలతో మభ్యపెట్టి, ఎదుటివారినీ నగ్నంగా మారాలంటూ కవ్విస్తారు. లొంగిపోతే.. ఇక అయిపోయినట్లే. ఆ వ్యవహారమంతా రికార్డు చేస్తారు. సంబంధిత ఫొటోలు, వీడియోలు బయట పెడతామంటూ బెదిరించి, డబ్బు గుంజుతారు.

చెడు తొందరగా ఆకర్షిస్తుంది



సెల్‌ఫోన్ ఎక్కువగా వాడుతున్న యువత పక్కదారి పడుతోంది. ఫోన్‌లో ఉన్న మంచి కంటే చెడే ఎక్కువగా ఆకర్షిస్తుంది. పిల్లల్లో చదువు, ఇతర విషయాలపై ఏకాగ్రత సన్నగిల్లుతుంది. ఫలితంగా ఆత్మవిశ్వాసం కోల్పోతూ కోపం, మానసిక ఒత్తిడి, ఆందోళనలు పెరుగుతాయి. పోర్న్ వీడియోలకు బానిసలై, సంఘ విద్రోహ శక్తులుగా తయారవుతున్నారు.

– డాక్టర్ ఎ.శ్రీనివాస్ రెడ్డి, సైకాలజిస్టు

నేర ప్రవృత్తి పెరుగుతోంది



పిల్లలకు ఆన్‌లైన్ క్లాసులు, వివిధ కారణాలతో సెల్‌ఫోన్లు ఇవ్వాల్సి వస్తోంది. అయితే, వారు ఏం చూస్తున్నారని తల్లిదండ్రులు గమనిస్తుండాలి. పిల్లలు ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటు పడి, తల్లిదండ్రుల అకౌంట్లలోని డబ్బులు పోగొడుతున్నారు. అశ్లీల చిత్రాలు, ఇతర వీడియోలతో నేర ప్రవృత్తి పెరిగి, పలు నేరాలు చేస్తున్నారు. కేసుల పాలవుతూ జైలుకు సైతం వెళ్తున్నారు.

– జి.నరేందర్, ఏసీపీ, కరీంనగర్ టౌన్

సెల్‌ఫోన్లే కారణం



పిల్లలు, యువత చెడుమార్గంలో పయనించడానికి ముఖ్య కారణం సెల్‌ఫోన్‌లే. ఆన్‌లైన్ క్లాసుల నెపంతో వివిధ లింకులు, వీడియోలు చూస్తూ మొబైల్‌కు బానిసలవుతున్నారు. చదువుపై ధ్యాస పెట్టకుండా, జీవితాలు నాశనం చేసుకుంటున్నారు. కొందరు వీడియోలు చూస్తూ మద్యం, డ్రగ్స్‌కు బానిసలవుతున్నారు. ఫోన్ అవసరం తీరాక తల్లిదండ్రులు వెంటనే తీసుకోవాలి.

– ఎ.కిరణ్‌కుమార్, న్యాయవాది

అవగాహన కల్పించాలి



ఫోన్లను చదువు కోసం కాకుండా చెడిపోవడానికే ఎక్కువగా వాడుతున్నారు. తల్లిదండ్రులు పట్టించుకుంటే దీన్ని చాలావరకు నియంత్రించవచ్చు. స్కూళ్లు, కాలేజీల్లో సెల్‌ఫోన్లతో కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలి. ఈ మధ్య ఆన్‌లైన్ గేమ్స్ ఆడి, డబ్బులు పోగొట్టుకోవడం, వివిధ నేరాలకు పాల్పడటం, చదువుకున్న యువత జల్సాల కోసం చోరీలు చేస్తుండటం బాధ కలిగిస్తోంది.

– శనిగరపు రవి, ప్రభుత్వ టీచర్

గంజాయి విక్రేతల అరెస్ట్



నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

బుగ్గారం: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులను అరెస్టు చేసినట్లు ఎస్సై శ్రీధర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని వెల్గొండ గ్రామానికి చెందిన గుజ్జేటి వంశీ, ధర్మపురికి చెందిన తుమ్మ ఉపేందర్ మంగళవారం గంజాయిని అక్రమంగా తరలిస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. స్పందించిన ఎస్సై తమ సిబ్బందితో వెల్గొండ క్రాస్‌రోడ్డు వద్ద తనిఖీలు చేపట్టారు. ఇందులో అక్రమంగా తరలిస్తున్న 100 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఏడుగురికి గంజాయి పరీక్షలు

చందుర్తి (వేములవాడ): చందుర్తి సర్కిల్ పరిధిలోని గ్రామాల్లో అనుమానిత యువకులకు మంగళవారం గంజాయి పరీక్షలు నిర్వహించినట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. గంజాయి సేవిస్తున్నారన్న అనుమానంతో వారికి పోలీసుస్టేషన్ ఆవరణలో పరీక్షలు నిర్వహించారు. నెగెటివ్ రావడంతో వారిని వదిలేసినట్లు సీఐ తెలిపారు.

ఇద్దరికి జైలు, జరిమానా

సిరిసిల్ల కల్చరల్: దొంగతనాలకు సంబంధించిన రెండు వేర్వేరు కేసుల్లో నిందితులకు జైలు శిక్ష విధిస్తూ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ మంగళవారం తీర్పునిచ్చారు. ఎస్పీఅఖిల్ మహాజన్ తెలి పిన వివరాల ప్రకారం.. పట్టణంలోని జయనగర్‌కు చెందని పుదరి రాజు 2017 నవంబర్ 11న అంబికా నగర్‌లోని ఓ ఇంటి తాళం పగలగొట్టి రూ.97 వేల సామగ్రిని దొంగిలించాడు. ఇంటి యజమాని ఫి ర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు రాజును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఏడుగురి సాక్షులను విచారించిన న్యాయస్థానం నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.5వేల జరిమానా విధించింది. పట్టణంలోని శివనగర్‌కు చెందిన బలవేణి సుమన్ అలియాస్ అర్జున్ గంజాయికి అలవా టుపడ్డాడు. అవసరమైన వారికి అమ్మడానికి రవా ణా చేస్తుండగా పోలీసులు సాయినగర్ ప్రాంతంలో అదుపులోకి తీసుకున్నారు. అప్పటి సీఐ ఉపేందర్ చార్జ్‌షీట్ దాఖలు చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ చె లుమల సందీప్ కేసు వాదించగా, తొమ్మిది మంది సాక్షులను ప్రవేశపెట్టారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి సుమన్‌కు ఏడాది జైలుశిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలడించారు.

కొడుకు పోషించడం లేదని.. ఉరేసుకుని వృద్ధుడి ఆత్మహత్య

జగిత్యాలక్రైం: కొడుకు పోషించడం లేదని జగిత్యాల అర్బన్ మండలం హస్నాబాద్ గ్రామానికి చెందిన చట్లపల్లి గంగారాం (70) తీవ్ర మనస్తాపంతో మంగళవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పట్టణ ఎస్సై మన్మదరావు కథనం ప్రకారం .. గ్రామానికి చెందిన గంగారాం పేరున ఆస్తులున్నాయి. ఉన్న ఇంట్లోనే కొడుకు వేరుకాపురం పెట్టాడు. గంగారాం తన భార్య భాగ్యమ్మతో కలిసి నివసిస్తున్నాడు. గంగారాంను కొడుకు కొద్దిరోజులుగా పట్టించుకోవడం లేదు. దీంతో మనస్తాపానికి గురైన ఆయన ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భాగ్యమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

'శ్రీచైతన్య'లో కాన్షియస్‌నెస్ క్లబ్



అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ సీఐ బాబా

తిమ్మాపూర్(మానకొండూర్): కలెక్టర్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని శ్రీచైతన్య హైస్కూల్‌లో మంగళవారం కాన్షియస్నెస్ క్లబ్ ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా మత్తుపదార్థాల నిర్మూలనపై అవగాహన కల్పించామని ఎక్సైజ్ సీఐ కె.బాబా తెలిపారు. క్లబ్‌లో స్కూల్ ప్రిన్సిపాల్, ఇద్దరు ఉపాధ్యాయులతోపాటు ఇద్దరు విద్యార్థులు సభ్యులుగా ఉంటారని వివరించారు. ఎక్సైజ్ ఎస్సై శ్రీకాంత్ మాట్లాడుతూ... విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా డ్రగ్ ఫ్రీ ఇండియా నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ సంపత్ మాట్లాడుతూ.. చైల్డ్ రైట్స్, గుడ్ టచ్, బ్యాడ్ టాచ్, మొబైల్ అతివినియోగం అనర్థాలు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.రవీందర్‌రెడ్డి, ఎక్సైజ్ సిబ్బంది శేషగిరి రాజు, కొండల్‌రెడ్డి, మనోహర్, ధనలక్ష్మి, మహిళా శిశు సంక్షేమ సిబ్బంది రమేశ్, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

విషాదం మిగిల్చిన రోడ్డు ప్రమాదం

- కారు, బైక్ ఢీకొని వ్యక్తి మృతి
- మరో వ్యక్తికి తీవ్రగాయాలు



స్వామి(ఫైల్)

ధర్మారం(ధర్మపురి): పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం కటికెనపల్లి బస్టాండ్ సమీపంలో మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇదే గ్రామానికి చెందిన పెసరు స్వామి(46) దుర్మరణం చెందడం ఆ కుటుంబంలో తీవ్రవిషాదం నింపింది. ఇదే ఘటనలో మరో వ్యక్తి మిట్ట ఆశాలు తీవ్రంగా గాయపడ్డాడు. బంజేరుపల్లి నుంచి కటికెనపల్లికి స్వామి, ఆశాలు మోటారు సైకిల్‌పై వస్తున్నారు. ఎదురుగా వచ్చిన కారు అతివేగంగా ఢీకొనడంతో పెసరు స్వామి అక్కడికక్కడే మరణించాడు. మిట్ట ఆశాలు కాలు విరిగింది. సమాచారం అందుకున్న ఎస్సై లక్ష్మణ్ సంఘటన స్థలానికి చేరుకుని గాయపడిన ఆశాలును కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించారు. స్వామి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి పంపించారు.

ఆ కుటుంబానికి అన్నీ కష్టాలే..

నిరుపేద కుటుంబానికి చెందిన పెసరు స్వామి–స్వప్న దంపతులు. వీరికి కూతుళ్లు సింధూ, శివాణి ఉన్నారు. చిన్నకూతురు శివాణి ఇంజినీరింగ్ కోర్సు చదువుతోంది. పెద్దకూతురు సింధూకు నాలుగేళ్ల క్రితం వేములవాడ మండలం నూకలమర్రికి చెందిన సమీప బంధువు, వరుసకు మేనల్లుడు, ముంబాయిలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కునాల్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. వీరికి ఒక కుమారుడు. ఆ తర్వాత వీరి కాపురంలో కలతలు రావడంతో మనస్థాపానికి గురైన సింధూ ముంబాయిలోని తమ ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమె కుమారుడిని స్వామి దంపతులు తీసుకొచ్చి సంరక్షించుకుంటున్నారు. స్వామి ఫొటోగ్రాఫర్‌గా పని చేసినా ఆశించిన ఆదాయం రాక కుటుంబ పో షణ భారంగా మారింది. దీంతో భార్య స్వప్నతో కలిసి గ్రామంలోనే టిఫిన్ సెంటర్ ఏర్పాటు చేసుకున్నారు. రెండేళ్లక్రితం పెద్ద కూతురు చనిపోవడం, ప్రస్తుతం భర్త స్వామి రోడ్డు ప్రమాదంలో మరణించడంతో స్వప్నతోపాటు కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. తండ్రి మరణవార్త విన్న కూతురు శివాణి స్పృహతప్పి పడియింది. గ్రామస్తులు వైద్యుడి వద్దకు తీసుకెళ్లి చికిత్స చేయించారు.

క్షయ నివారణలో భాగస్వాములు కావాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్

జగిత్యాల: క్షయ నివారణలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ అన్నారు. మంగళవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో క్షయ విజేతలకు టీబీ అలాట్ ఇండియా, ఇంపాక్ట్ ఇండియా ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహించారు. క్షయవ్యాధికి గురై చికిత్స తీసుకుని సంపూర్ణంగా కోలుకున్న టీబీ చాంపియన్స్ వారివారి గ్రామాల్లో వారే అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో మాతాశిశు సంక్షేమ సంరక్షణాధికారి జైపాల్‌రెడ్డి, ఇమ్యునైజేషన్ అధికారి శ్రీనివాస్, డీపీవో రవీందర్, కట్ట హరీశ్ పాల్గొన్నారు.

ఉద్యోగాల పేరిట మోసం.. నిందితుల అరెస్టు

సిరిసిల్ల క్రైం: సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం ఇప్పిస్తానని డబ్బులు తీసుకొని మోసం చేసిన వ్యక్తిని రిమాండ్ చేసినట్లు సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ తెలిపారు. రాపెల్లి విద్యాసాగర్ వద్ద రూ.2లక్షలు తీసుకున్నాడు. ఉద్యోగం ఇప్పించకపోగా.. డబ్బులు తిరిగి ఇవ్వలేదు. బాధితుడి ఫిర్యాదుతో కాకర్ల భానుప్రకాశ్‌ను అరెస్టు చేశారు. సిరిసిల్లలోని బీవై.నగర్‌కు చెందిన సాగల జీవన్‌కు సిరిసిల్ల కలెక్టర్ కార్యాలయంలో డిస్ట్రిక్ట్ కో–ఆర్డినేటర్ ఉద్యోగం ఇప్పిస్తామని నిందితులు రూ.2లక్షలు, దానవీని సుప్రియ వద్ద రూ.1.70లక్షలు తీసుకుని మోసం చేశారు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు కొండికొప్పుల శంకర్‌ను అరెస్టు చేశారు. మిగితావారు పరారీలో ఉన్నట్లు సీఐ వెల్లడించారు.

మొబైల్ షాపులో చోరీ



దొంగతనం జరిగిన మొబైల్‌పాయింట్‌ను పరిశీలిస్తున్న పోలీసులు

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా కేంద్రంలోని గాయత్రి మొబైల్స్ షాపులో సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దొంగలు వెంటిలేటర్ నుంచి చొరబడి సుమారు రూ.2 లక్షల విలువైన ఫోన్లను దొంగిలించారు. షాపుయజమాని సోమవారం సాయంత్రం షాపునకు తాళాలు వేసుకుని వెళ్లాడు. గుర్తుతెలియని దొంగలు షాపు వెనకాల ఉన్న వెంటిలేటర్ నుంచి చొరబడ్డారు. మొబైల్‌ఫోన్స్‌తోపాటు రూ.15 వేలు ఎత్తుకెళ్లారు. మంగళవారం ఉదయం షాపు యజమాని వచ్చి చూసేసరికి సామగ్రి చిందరవందరగా ఉండటంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడకు చేరుకుని క్లూస్‌టీం ఆధారంగా ఫింగర్ ప్రింట్స్ సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

సర్వేపేరిట ఒంటిపూట బడి సరికాదు



సభ్యత్వం స్వీకరిస్తున్న మచ్చ శంకర్

జగిత్యాల: కులగణన సర్వే పేరిట 13 రోజులపాటు ఒంటిపూట బడులు నిర్వహించాలని చూడడం సరికాదని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మచ్చ శంకర్ అన్నారు. మంగళవారం పలు పాఠశాలల్లో ఎస్టీయూ సభ్యత్వ నమోదు చేపట్టారు. కులగణన సర్వేలో ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొనాలని, ఇందుకు ఒంటి పూట బడి నడపాలనే నిబంధనలతో పాఠశాలలపై వ్యతిరేక వచ్చే అవకాశాలున్నాయన్నారు. పాఠశాలలను పూర్తిగా మూసివేయకుండా సగంమంది ఉపాధ్యాయులు ఉదయం, సగంమంది మధ్యాహ్న సమయంలో సర్వే నిర్వహించేలా చూడాలన్నారు. టీఏలు, మెడికల్ బిల్లులు, జీపీఎఫ్ బిల్లులు వెంటనే మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బైరం హరికిరణ్, శ్రీనివాస్, నరేశ్ పాల్గొన్నారు.

మద్దతు ధరకే ధాన్యం విక్రయించాలి



ధాన్యం పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి రాంచంద్రం

జగిత్యాలరూరల్: రైతులు ధాన్యాన్ని మద్దతు ధరకే విక్రయించాలని జిల్లా వ్యవసాయాధికారి రాంచంద్రం అన్నారు. మంగళవారం రూరల్ మండలం పొలాసలోని ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ధాన్యంలో తేమ 17 శాతం వచ్చేలా ఆరబెట్టి కేంద్రాలకు తీసుకురావాలన్నారు. ఏడీఏ తిరుపతినా యక్, ఏఈవోలు శ్రీనివాస్, హరీశ్, ఆంజనేయులు, వరుణ్, రమ్య, రవళి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్ల జాప్యంపై గాంధీభవన్‌కు ఫోన్

జగిత్యాలరూరల్: రైతులు పండించిన ధాన్యం కొనుగోళ్లలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ జగిత్యాల రూరల్ మండలం సోమన్‌పల్లికి చెందిన గొంటి మొగిలి మంగళవారం గాంధీభవన్‌కు ఫోన్ చేశాడు. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినా ధాన్యం తూకం వేయడం లేదని, ఇంటింటికీ తిరిగి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొస్తే రైతులకు జరిగే మేలు ఇదేనా..? అని ప్రశ్నించాడు.



జైశ్రీరామ్.. జై హనుమాన్

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు అంజన్న ఆలయంలో మంగళవారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అంజన్నతోపాటు శ్రీవేంకటేశ్వరస్వామి, శ్రీలక్ష్మీ అమ్మవారిని దర్శించుకున్నారు. ఉదయం చలి అధికంగా ఉండడంతో మధ్యాహ్న సమయంలో రద్దీ పెరిగింది. భక్తుల ఏర్పాట్లను లయ ఏఈవో అంజయ్య, అధికారులు ఉమామహేశ్వరరావు, హరిహరనాథ్, రాజేందర్ రెడ్డి, చంద్రశేఖర్ పర్యవేక్షించారు.





గోదావరికి గంగాహారతి

ధర్మపురి: కార్తీక మాసం సందర్భంగా ధర్మపురి గోదావరికి గంగాహారతి కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయం నుంచి గోదావరి వద్దకు మేళతాళాలు, మంగళవాయిద్యాలతో వెళ్లి అక్కడ పూజలు చేశారు. శారదామహిళా మండలి, వాసవీ మహిళా మండలి సభ్యులు, కరీంనగర్‌కు చెందిన తిరుమల సేవా గ్రూప్ సభ్యుల కోలాట నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాస్, వేదపండితులు, అర్చకులు తదితరులున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

పాస్‌పోర్ట్ పోయినది

■ షేక్ కలీముద్దీన్ S/o. షేక్ ముజీబ్, H.No. 6-3-113, ఖాన్‌పుర, కరీంనగర్ వాస్తవ్యుడను. మాది ఉమ్మడి కుటుంబం. ఇందులో నుండి మా యొక్క అన్న గారు వేరే ఇంట్లోకి మారుతున్న క్రమంలో తేది: 30-10-2024 రోజున నాయొక్క ఒరిజినల్ పాస్‌పోర్ట్ నెం. V6387894 గలది పోయినది. కావున ఎవరికైనా దొరికినచో పై అడ్రస్‌లో సంప్రదించి ఇవ్వగలరని మనవి. సెల్: 9703808921. [K-1246786]

WANTED

■ ఒమేగా హోంకేర్‌లో వృద్ధులను, పేషెంట్లను పిల్లలను చూసుటకు వర్కర్స్ / నర్సులు కావలి. ఫ్రీ వసతి, ఫుడ్ జీ : 20K. Ph: 8977639662, 8977639663 [SCA24000542]

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692 [M-1253908]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:

9951602933
9951602824